క్లుప్తంగా

భవనం నుంచి కూలీలను ఖాళీ చేయిస్తాం : ఏవో

సాక్షి ఎఫెక్ట్

జగ్గయ్యపేట: బండిపాలెం గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు పలు రాష్ట్రాల కూలీలకు అడ్డాగా మారాయంటూ శుక్రవారం 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి ఒక ప్రకటనలో స్పందించారు. రైతు సేవా కేంద్రం కూలీలకు అడ్డాగా ఉండటం ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణతోపాటు రైతులకు ఇబ్బందిగా ఉన్నందున భవనం నుంచి కూలీలను ఖాళీచేయిస్తామని వివరించారు.

పూడిక తీత పనులు ప్రారంభం



నందిగామ టౌన్: వర్షాలు కురిసిన సమయంలో పట్టణంలోకి వరద రాకుండా ఎన్నెస్పీ కాల్వ పూడికతీత పనులు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పట్టణంలోని కేవీఆర్ కళాశాల నుంచి 65వ నంబరు జాతీయ రహదారి వరకు ఉన్న కాల్వ కట్ట పూడికతీత పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌సీ సెంటర్ ప్రారంభం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడులో బయో రీసెర్స్ సెంటర్(బీఆర్‌సీ)ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం డివిజన్ మేనేజర్ జి.వస్నూరప్ప మాట్లాడుతూ బీఆర్‌సీ ప్రారంభం నేపథ్యంలో 200 లీటర్లు జీవామృతం తయారు చేసినట్లు తెలిపారు. ఈసెంటర్‌లో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో జీవన ఎరువులు తయారు చేయడంతోపాటు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఏపంటకైనా పురుగులు, తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయాలు, ద్రావణాలు తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. అన్ని రకముల విత్తనాలు, పెరటి తోటలు వేసుకోవటానికి తక్కువ ధరకే విత్తనాలు అందజేస్తామన్నారు. మండలంలోని రైతులు ఈసెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి పావని, గింజుపల్లి హరీష్, రైతులు పాల్గొన్నారు.

చందర్లపాడు ఎస్‌ఐగా ధర్మరాజు



నందిగామరూరల్:చందర్లపాడు ఎస్‌ఐగా ధర్మరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. ముఖ్యంగా అక్రమ వ్యాపారాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటానని వివరించారు. ఎస్‌ఐ ధర్మరాజుకు పోలీసు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరం లాంటిదని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కింద 13 మందికి మంజూరైన రూ.5లక్షలను ఎమ్మెల్యే తాతయ్య శుక్రవారం తనగృహంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టె నాగరాజు, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు మల్లెల కొండయ్య, వేదులాపురి సైదా, నాయకులు గాలం శ్రీను, షేక్ షబ్బు పాల్గొన్నారు.

340 మందికి వైద్యపరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 14 వ వార్డు శ్రీనాగలక్ష్మి అమ్మవారి దేవాలయం వద్ద శుక్రవారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు పాల్గొని మొత్తం 340 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. వీరిలో కళ్లజోళ్లు అవసరమైనవారు 160 మంది, కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకోవాల్సినవారు 56 మంది ఉన్నారని ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్దన్ తెలిపారు. వైద్యశిబిరాన్ని శనివారం అమ్మాణీ కళాశాల వద్ద నిర్వహించనున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వేదులాపురి అలేఖ్య, మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్లు కట్టా నరసింహారావు, మైనేని రాధా, ముల్లంగి రామకృష్ణారెడ్డి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస ఉత్సవాలు

నందిగామరూరల్: శ్రావణమాస ఆఖరి శుక్రవారాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పల్లగిరిగట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతీ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు చేశారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీమాతను మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. మరిడీ మహాలక్ష్మి, మాగల్లులోని రాజ్యలక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు..

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస ఉత్సవాల ఆఖరి శుక్రవారం సందర్భంగా జగ్గయ్యపేటలోని పలు అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం, దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి, అయ్యప్పస్వామి ఆలయంలోని అష్టలక్ష్మి సహిత వైభవలక్ష్మి తదితర ఆలయాలను పెద్దసంఖ్యలో భక్తులు సందర్శించి ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. నకాశిబజారులోని కనకదుర్గ అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించగా, వెండిదేవాలయంలో శ్రీమహాలక్ష్మి హోమం నిర్వహించారు. వెండిదేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, ఆయా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నందిగామలో మహాలక్ష్మీదేవిగా వాసవి అమ్మవారు



పేటలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో ఈశ్వరీమాతను పలురకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.



కంచికచర్ల మండలంలో..



కంచికచర్ల: శ్రావణ మాస ఆఖరి శుక్రవారం సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహాలక్ష్మి అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గొట్టుముక్కలలోని అంకమ్మ తల్లి సౌభాగ్యలక్ష్మిగా దర్శనమివ్వగా భక్తులు విశేష పూజలు చేశారు.

మాజీమంత్రి కాకాణికి పరామర్శ

నందిగామరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తప్పొప్పులు, న్యాయ అన్యాయాలతో పనిలేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన అతిథి గృహంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జగన్‌మోహనరావు పరామర్శించారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకారణంగా రాష్ట్రంలోని జైళ్లన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతోనే నిండి ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఏడాదిన్నరగా అరాచక పాలన సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీఎమ్మెల్యే వెంట నాయకులు ముక్కపాటి నరసింహారావు, కోటేరు ముత్తారెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, ఆవుల రమేష్‌బాబు, బండి మల్లికార్జున రావు, పెసరమల్లి స్టాలిన్, బుగ్గినేని సురేష్, మార్త శ్రీనివాసరావు, మంచాల చంద్రశేఖర్, చింతోటి ప్రసాద్, కందుల నాగేశ్వరరావు ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్ ...

నందిగామ టౌన్(చందర్లపాడు): ఇటీవల టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన చందర్లపాడు మండలం విభరింతలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షేక్ సిలార్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శుక్రవారం పరామర్శించారు. దాడిలో గాయపడి చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న సిలార్‌ను కలిసి అతని ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఏడాదిగా సాగుతున్న అరాచకపాలనకు అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ ఉన్మాద పాలనకు భవిష్యత్‌లో ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. సిలార్‌ను పరామర్శించినవారిలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, చింతోటి ప్రసాద్, గుడేటి శ్రీనివాసరావు, మార్త శ్రీను తదితరులు ఉన్నారు.




మాజీమంత్రి కాకాణిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



వైఎస్సార్ సీపీ కార్యకర్త సిలార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

వైరా కట్టలేరు కాజ్‌వేకు గండి



వరదలకు కొట్టుకుపోయిన దాములూరు-కూడలి కాజ్‌వే



రాకపోకలు సాగించేందుకు వీలుగా కాజ్‌వేను సిద్ధం చేసుకుంటున్న వాహనదారులు

- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

నందిగామ రూరల్: ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ఎగువ నుంచి వచ్చిన వరద కారణంగా మండలంలోని దాములూరు, కూడలి గ్రామ సమీపంలోని వైరా కట్టలేరు కాజ్‌వేకు గండి పడింది. దీంతో వరద తగ్గుముఖం పట్టే వరకు అధికారులు నందిగామ-వీరులపాడు మధ్యన రాకపోకలను నిలుపుదల చేశారు. అయితే గడిచిన నాలుగైదు రోజులుగా వరద క్రమక్రమంగా తగ్గుతుండటంతో ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు, తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే కాజ్‌వే రోడ్డు సింహభాగం వరదకు కొట్టుకుపోయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో వాహనదారులు రాళ్లు, మట్టి వేసి రాకపోకలకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

స్పందించని అధికారులు..

వరదల దాటికి రోడ్డు కొట్టుకుపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వేపై రాకపోకలు సాగిస్తున్నారని ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే పరిస్థితేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసులకు అప్పగింత

మక్కపేట(వత్సవాయి):అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళలను స్థానికులు పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం మక్కపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక బీసీ కాలనీలో ముగ్గురు మహిళలు అనుమానాస్పదంగా సంచరిస్తూ ఓ ఇంటి దండెంపై ఆరేసిన చీరలను మూట కట్టుకుని వెళ్తుండటాన్ని గ్రామస్తులు గమనించి వెంబడించారు. ఈక్రమంలో సదరు మహిళలు మహిళలు వత్సవాయి రోడ్డు వైపు పరుగెత్తడంతో కొందరు యువకులు బైక్‌లు వేసుకుని వారిని వెంబడించారు. ఇంతలో ఓవ్యక్తి బైక్‌పై వచ్చి ముగ్గురు మహిళల్లో ఒకరిని వాహనం ఎక్కించుకుని పరారయ్యాడు. గ్రామస్తులు మిగిలిన ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారిస్తున్నారు.

సర్వే సజావుగా సాగాలి



కంచికచర్ల: స్వమిత్వ సర్వేను నిష్పక్షపాతంగా చేయాలని ఖచ్చితమైన హద్దులు ఉండేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారిణి పి.లావణ్యకుమారి సూచించారు. మండలంలోని కీసరలో జరుగుతున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఇంటి సరిహద్దులు ఖచ్చితమైన కొలతలు వేయాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఇంటి యజమానులకు భూహక్కు పత్రాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఏసుబాబు, పంచాయతీ కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం, సర్వేయర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్చుకుని మా భూమిని కబ్జా చేశారు.. తర్వాత ఆ భూమిని వారి కుటుంబ సభ్యుల పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదనివీరులపాడు మండలం అల్లూరు గ్రామానికి చెందిన బాధితులు సోడా రాజమణి, బిక్షాలు శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎదుట వాపోయారు. వారు మాట్లాడుతూ తమకు చెందిన అల్లూరు గ్రామ సర్వే నంబర్ 131/1లో 2.18 ఎకరాల భూమిని గతంలో గ్రామానికే చెందిన తిరుమలశెట్టి సాంబశివరావుకు కౌలుకు ఇవ్వగా, రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమిని ఆయన తనభార్య వెంకటరమణ పేర మార్పించుకున్నారు. అనంతరం కుటుంబసభ్యుల పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్ చేయకూడదన్న నిబంధనను కూడా అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయంపై పలుమార్లు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదన్నారు. జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి కబ్జాకు గురైన మా భూమిని విడిపించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్: ప్రముఖ సినీనటుడు, కేంద్ర మాజీమంత్రి చిరంజీవి జన్మదిన వేడుకలను జగ్గయ్యపేటలో శుక్రవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు షేక్ మోహిసిన్, జిల్లా చిరంజీవి యువత నాయకులు వల్లపునేని గోవింద్, లింగాల అరవింద్, తులసి బ్రహ్మం, చిరంజీవి యువత పేట పట్టణ, మండల అధ్యక్షులు జక్కంపూడి మల్లికార్జున్, పొట్లకాయల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామరూరల్: సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను చిరు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పోలిశెట్టి వరుణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాంధీసెంటరులో కేక్ కట్ చేసి, ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న మునగచర్ల గ్రామానికి చెందిన చిరంజీవి అభిమానికి రూ.40 వేలను ఆర్థికసాయంగా అందించారు. కార్యక్రమంలో పూజారి రాజేష్, తాటి రామకృష్ణ, తాటి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. న్యాయవాదులు పీఎల్ నరసింహారావు, ఎక్కిరాల హనుమంతరావు, పెసరమల్లి సురేష్, సాంబశివ రావు, మందా వజ్రయ్య తదితరులు పాల్గొన్నారు.



పేటలో కేక్ కట్ చేస్తున్న చిరంజీవి అభిమానులు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పెనుగంచిప్రోలు:పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారినుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యాధికారి నాగలక్ష్మి పేర్కొన్నారు. ఫ్రైడే డ్రై డేను పురస్కరించకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పెనుగంచిప్రోలులో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ఆసుపత్రి ఓపీ 60 నుంచి 70 వరకు ఉంటుందన్నారు. టైఫాయిడ్, జలుబు లక్షణాలతో రోగులు వస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఇంటిలోని నీటి తొట్టెలు, ట్యాంక్‌లు కడిగి పొడిగా ఆరబెట్టుకోవడం ద్వారా దోమలను నిర్మూలించవచ్చన్నారు. ఖాళీ స్థలాల్లో మురుగు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వాడి పారేసిన టైర్లు, కొబ్బరిబోండాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ నాగలక్ష్మి తదితరులు

పర్యావరణ హితానికి కృషి చేయాలి

నందిగామటౌన్: పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు సనాతన సాంప్రదాయ పద్ధతిలో వినాయక పూజలు నిర్వహించాలని గణపతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి రాజు, ఉపాధ్యక్షుడు బబ్బూరి శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో నందిగామలోని వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి గణపతి విగ్రహాలను వాడటంతోపాటు మండపాల వద్ద ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. వివాదాలు లేకుండా కులమతాలకతీతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తొర్లికొండ సీతారామయ్య, వందేమాతరం అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీల నాయకులు

మిక్‌లో ముగిసిన శిక్షణ తరగతులు

కంచికచర్ల : స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో 'సుస్థిర ఎలక్ట్రిక్ వాహన సాంకేతికతలు- పునరుత్పాదక ఇంధన సమీకరణ-చార్జింగ్ నిల్వ అండ్ గ్రిడ్ సాంకేతికతతో ఉద్భవిస్తున్న పరిష్కారాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీ వంశీకిరణ్, జేఎన్‌టీయూ కాకినాడ కోఆర్డినేటర్ కె.రవీంద్ర మాట్లాడుతూ అధ్యాపకుల బోధన నాణ్యతను పెంచడమే ఈ కార్యక్రమ నిర్వహణ ముఖ్య ఉద్దేశమన్నారు. కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, ఎం.సుహాస్, డాక్టర్ పి. ప్రదీప్ పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన అధ్యాపకులతో నిపుణులు

మురుగు కూపాలుగా ఖాళీస్థలాలు

- ఖాళీస్థలాల్లో నిల్వ ఉంటున్న మురుగు నీరు
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన ప్రజలు

పెనుగంచిప్రోలు: పరిసరాల అపరిశుభ్రతతోపాటు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆయా గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో, వీధుల్లో మురుగు నీరు చేరింది. పలుచోట్ల మురుగు నీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో వీధులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. మండలంలోని ముచ్చింతాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలు వీధుల్లో ఖాళీ స్థలాల్లో మురుగునీరు అధికంగా చేరడంతో ఆయాప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. ఇదే ప్రాంతంలో గతంలో ఓ బాలుడు మురుగు నీటిలో పడి మృతిచెందగా, ఆ విషయం రెండురోజుల తర్వాత ఆ బాలుడి మృతదేహం మురుగునీటిల్లోంచి పైకి తేలినప్పుడు గ్రామస్తులు గుర్తించిన దుస్థితి. అదేవిధంగా ఓ ఇంటిలో ఇద్దరు వ్యక్తులు డెంగీ లక్షణాలతో మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అసలే వ్యాధుల కాలం... ఆపై ఎక్కడికక్కడ మురుగు నీటి గుంతలు, పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

గుంతల్లో చేరిన నీరు...

మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల మధ్య గతంలో గుంతలు పెట్టి మట్టి, గలస తోలడంతో పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో ఆ గుంతల్లో వర్షపు నీరు చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. మండలంలోని సుబ్బాయిగూడెం, వెంగనాయకునిపాలెం, శనగపాడు గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో వర్షపు నీటితోపాటు మురుగు నీరు చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. వర్షాకాలం నేపథ్యంలో ఈ గుంతల కారణంగా దోమలు వృద్ధి చెందకుండా వాటిల్లో ఆయిల్ బాల్స్ వేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.




ముచ్చింతాల ఎస్సీ కాలనీలో ఖాళీస్థలంలో నిలిచిన మురుగు



సుబ్బాయిగూడెం గ్రామ ఎస్సీకాలనీ వద్ద చేరిన మురుగునీరు

రావిలాలలో పారిశుద్ధ్యం అధ్వానం..

రావిరాల(జగ్గయ్యపేట) : మండలంలోని రావిరాల గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా తయారైంది. జయంతిపురం శివారు గ్రామమైన రావిలాలలో సుమారు వెయ్యిమంది జనాభా ఉంటారు. గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఇళ్ల ముందు మూడడుగుల మేర మురుగు నీరు పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో సైతం పూడిక తీయకపోతుండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగునకు తగిన చర్యలు తీసుకోవాలని రావిరాల గ్రామస్తులు కోరుతున్నారు.



సత్యమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో ఇళ్ల మధ్య పారిశుద్ధ్య పరిస్థితి ఇది

దివ్యాంగుల రీవెరిఫికేషన్ క్యాంపు పరిశీలన

జగ్గయ్యపేటఅర్బన్: దివ్యాంగుల రీ వెరిఫికేషన్ క్యాంప్‌లో ఏ ఒక్క దివ్యాంగునికి అన్యాయం జరగదని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల రీ వెరిఫికేషన్ క్యాంపును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండి పింఛన్ నిలిచిపోయిన దివ్యాంగుల వివరాలను తెలియజేయాలని దివ్యాంగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావుకు సూచించారు. మధ్యాహ్నం వేళ దివ్యాంగులకు భోజన వసతి కల్పించారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు

- నేడు జయంతిలో కలెక్టర్ పర్యటన

వీరులపాడు: మండలంలోని జయంతి గ్రామంలో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ పాల్గొనున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. ఉదయం ఏడుగంటలకు కలెక్టర్ గ్రామానికి చేరుకుని, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకుంటారన్నారు. అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com